బస్ షెల్టర్లలో ఏసీలేవి?


ఏసీల స్థానంలో ఏర్పాటు చేసిన పనిచేయని ఫ్యాన్, ఇన్‌సెట్‌లో పని చేయని ఎస్‌ఓఎస్ అలారం

ఖైరతాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం ఎండలో నిలబడాల్సిన అవసరం లేదు. ఎంచక్కా ఏసీ షెల్టర్లలో హాయిగా ఉండవచ్చు. నగరంలో 2018లో గత ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో ఏసీ బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తూ అన్న మాటలివి. కానీ వాటి నిర్వహణ గాలికి వదిలేయడంతో అందులో ఉండాల్సిన ఒక్క ఏసీ కూడా కనిపించడంలేదు. దీంతో పాటు ఏసీ బస్ షెల్టర్లలో అప్పట్లో ఏర్పాటు చేసిన వైఫై, ఫోన్ చార్జింగ్, సీసీ కెమెరాలు, ఎస్‌ఓఎస్ అలారం లాంటివి ఒక్కటి కూడా పనిచేయడం లేదు. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం పక్కనున్న 8 ఏసీ బస్ షెల్టర్లలో ఏడింటిలో ఏసీలను, సీసీ కెమెరాలను దొంగలు ఎత్తుకెళ్లారట. ఉన్న ఒక్క ఏసీ కూడా పని చేయడం లేదు. చోరీకి గురైనట్టు చెబుతున్న ఏసీల స్థానంలో చిన్న ఫ్యాన్‌లను ఏర్పాటు చేసినా, అవి కూడా పనిచేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ప్రయాణికులు పనిచేయని ఏసీ షెల్టర్లలో ఉక్కపోత భరించలేక, బయట ఎండకు ఉండలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏర్పాటైన రెండు సంవత్సరాలలోపే నిర్వహణ లోపంతో ఇవి పనిచేయడం లేదు. డిజైన్ బిల్ట్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ బేసిస్ కింద నడపాల్సిన ఈ బస్ షెల్టర్లను నిర్వహణ కోసం తీసుకున్న వారు యాడ్స్ రూపంలో ఆదాయాన్ని గడిస్తున్నా ఏసీలను, సీసీ కెమెరాలను దొంగలు ఎత్తుకెళ్లారని చెబుతుండడం విశేషం. జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే నగరంలో ఇలాంటి ఏసీ బస్ షెల్టర్లన్నీ పనిచేయడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటి నర్వహణపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని అమ్మకానికి పెట్టి మోసం

- నలుగురి అరెస్టు

బంజారాహిల్స్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం తమదేనని నమ్మించి కోట్లాది రూపాయలు తీసుకొని మోసం చేసిన నలుగురిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌కు చెందిన కాటంరెడ్డి శశిధర్ రెడ్డి శ్రీవెన్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ పేరుతో సంస్థ నిర్వహిస్తున్నారు. అతడికి రెండేళ్ల క్రితం బీసీ మైలారప్ప అనే వ్యక్తి ద్వారా బెంగళూరుకు చెందిన కె.కృష్ణ ప్రసాద్, ఆర్.జగన్నాథ్, గున్నా సురేందర్ రెడ్డి అనే వ్యక్తులు పరిచయం అయ్యారు. బెంగళూరులోని ఎలహంక ప్రాంతంలోని హోసనహళ్లి గ్రామంలో తనకు 11.30 ఎకరాల స్థలం ఉందని, దాన్ని డెవలప్‌మెంట్‌కు ఇస్తామని నమ్మించారు. వేరే చోట ప్రభుత్వానికి కృష్ణ ప్రసాద్ తండ్రి గోపీనాథ్ స్థలం ఇవ్వడంతో దానికి బదులుగా ఎలహంకలో స్థలాన్ని కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని నమ్మబలికారు. సరైన బిల్డర్ దొరికితే స్థలాన్ని డెవలప్‌మెంట్‌కు ఇస్తామని, లేకుంటే అమ్ముతామని చెప్పారు. వారి మాటలు నమ్మిన శశిధర్‌రెడ్డి రూ. 14 కోట్లకు స్థలాన్ని కొనేందుకు అంగీకరించారు. దీనికోసం రూ. 5.35 కోట్లు కృష్ణ ప్రసాద్‌తో పాటు ఆర్. జగన్నాథ్‌కు చెందిన జాకాన్ బిల్డింగ్ సొసైటీకి చెల్లించారు. కొన్నాళ్ల తర్వాత వాకబు చేయగా స్థలంపై కృష్ణ ప్రసాద్‌కు ఎలాంటి హక్కులు లేవని, ఆ స్థలాన్ని మొత్తం కర్నాటక ప్రభుత్వం వైఏఎస్ చారిటబుల్ ట్రస్ట్, కోదాడ సమాజ అనే సంస్థలకు కేటాయించినట్టు తేలింది. తనను మోసం చేసేందుకు బోగస్ పత్రాలతో స్థలం తమదేనని నమ్మించిన కే.కృష్ణ ప్రసాద్, ఆర్.జగన్నాథ్, గున్నా సురేందర్‌రెడ్డి, బీసీ. మైలారప్పలపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శశిధర్‌రెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించగా, ఐపీసీ 420,506, రెడ్విత్ 120(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

బంజారాహిల్స్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య నిర్వహిస్తున్న వ్యభిచారం గృహంపై మధురానగర్ పోలీసులు దాడి చేశారు. ఇంజనీర్స్ కాలనీలో రమేష్ గుప్తా అనే వ్యక్తి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్టు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో తనిఖీ చేయ గా అక్కడ నిర్వాహకురాలతో పాటు 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

అక్రమ గ్యాస్ రీ ఫిల్లింగ్ కేంద్రంపై దాడులు

బోరబండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్యాస్ రీ ఫిలింగ్ చేస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. బోరబండ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్వీ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం హబీబా ఫాతిమా నగర్ ఫేస్-2కు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ గ్యాస్ అక్రమంగా రీ ఫిలింగ్ చేస్తున్నాడని తెలుసుకొని సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అతని నుంచి నాలుగు సిలిండర్లు స్వాధీనం చేసుకొని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రౌడీ షీటర్ల కదలికలపై ఆరా

బోరబండ: వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్ల కదలికలపై పోలీస్‌లు దృష్టి సారించారు. శుక్రవారం రాత్రి బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు ఆరా తీశారు. వారు ఇళ్లల్లో ఉంటున్నారా, లేదాని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పోలీస్‌లు హెచ్చరించారు.

తనపై దాడి చేశారని హిజ్రా ఫిర్యాదు

బోరబండ: హిజ్రాపై దాడి చేసి గాయపరిచిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం అర్ధరాత్రి మధురానగర్‌లో నివాసముంటున్న హిజ్రాతో కొంతకాలంగా ఉమేష్ చంద్ర సన్నిహితంగా ఉండేవాడు. హిజ్రా వద్ద డబ్బులు తీసుకుంటూ మద్యానికి, గంజాయి మత్తుకు బానిస అయ్యాడు. మద్యానికి డబ్బులు ఇవ్వమని హిజ్రాని అడిగితే లేవనడంతో మాటకు మాట పెరిగి సైట్-1 రామాలయం సమీపంలో హిజ్రాపై దాడికి పాల్పడి గాయపరిచాడు. బాధితురాలు శుక్రవారం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన వేదిక సమాచార దీపిక


గ్రంథాలయంలో పాఠకులు

- నిరుద్యోగులకు ఉపయోగంగా సనత్‌నగర్ గ్రంథాలయం



సనత్‌నగర్ గ్రంథాలయం

సనత్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల పుస్తకాలు కొనలేని వారికి గ్రంథాలయం ఓ మంచి వేదిక. స్మార్ట్ ఫోన్‌లో మునిగిపోతున్న టెక్ యుగంలో కూడా నగరంలో పలు గ్రంథాలయాలు తమ ఉనికిని చాటుకుంటున్నాయి. అందులో సనత్‌నగర్ గ్రంథాలయం ఒకటి. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన సనత్‌నగర్ గ్రంథాలయం నాటి నుంచి నేటి వరకు సేవలందిస్తున్నది. గ్రంథాలయం ప్రారంభ సమయంలో స్థిరమైన భవనం లేకపోవడంతో కొందరు దాతలు ముందుకొచ్చి నూతన భవన నిర్మాణానికి సహకరించారు. అప్పటి నుంచి పాఠకులకు సేవలందిస్తున్నది.

మొత్తం 18,226 పుస్తకాలు..

ఈ గ్రంథాలయంలో రోజూ 6 తెలుగు పేపర్లు, 5 ఇంగ్లిష్ పేపర్లు, 2 ఉర్దూ పేపర్లు, ఒక హిందీ పేపర్ వస్తాయి. ఇవి కాకుండా వార పత్రికలు, పక్ష పత్రికలు, మాస పత్రికలు, మ్యాగజైన్‌లు అందుబాటులో ఉన్నాయి. నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, సైన్స్, సాంకేతిక రంగాల పుస్తకాలతోపాటు ఆధ్యాత్మిక పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయి. సనత్‌నగర్ లైబ్రరీలో 15,575 తెలుగు పుస్తకాలు, 1935 ఇంగ్లిష్ పుస్తకాలు, 342 హిందీ పుస్తకాలు, 374 ఉర్దూ పుస్తకాలతో పాటు మొత్తం 18, 226 పుస్తకాలున్నాయి. వీటితో పాటు స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలు ఉన్నాయి. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న యువత ఈ లైబ్రరీని వినియోగించుకుంటున్నారు.

అందుబాటులో సభ్యత్వం

తక్కువ మొత్తానికే సనత్‌నగర్ లైబ్రరీ సభ్యత్వం అందుబాటులో ఉండడంతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఎక్కువ మంది సభ్యత్వం తీసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు లైబ్రరీ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు సమీప కాలనీలకు చెందిన 1430 మంది సభ్యత్వం తీసుకున్నారు. రోజూ అన్ని వయసులకు చెందిన దాదాపు 80నుంచి 100 మంది పాఠకులు గ్రంథాలయానికి వస్తారు. సమీప జెక్ కాలనీ, మోడల్ కాలనీ, రాజీవ్‌నగర్లలో గ్రంథాలయానికి అనుబంధంగా మూడు బుక్ డిపోలు ఉన్నాయి. తక్కువ మొత్తానికే సభ్యత్వం ఇవ్వడంతోపాటు వచ్చిన మొత్తాన్ని లైబ్రరీ అభివృద్ధికి వినియోగిస్తున్నారు. పాఠకులు ఏదైనా పుస్తకం ఇంటికి తీసుకెళ్లి చదువుకోవాలనుకున్న తరుణంలో కొంత మొత్తం డిపాజిట్ చేస్తే ఇస్తారు. బుక్ తిరిగి ఇచ్చిన తర్వాత డిపాజిట్ మొత్తాన్ని పాఠకులకు ఇస్తారు.

దాతల సహకారం అవసరం



సనత్‌నగర్ గ్రంథాలయంలో ప్రస్తుతం ఉన్న పుస్తకాలతో పాఠకులకు పూర్తి న్యాయం చేయలేకపోతున్నాం. పాఠకులు కూడా కొన్ని ప్రత్యేక పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. నిధులు లేకపోవడంతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసేందుకు, కొత్త పుస్తకాలు కొనే అవకాశం లేదు. ఇప్పటికీ దాతలు ఇచ్చిన చిన్నపాటి మొత్తాలతో నెట్టుకొస్తున్నాం. దాతలు సహకరిస్తే గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, నిరుద్యోగులు, చిన్నారులు, పాఠకులకు ఉపయోగపడేలా అందుబాటులోకి తెస్తాం.

- హరిబాబు, లైబ్రరీయన్

ఫీజుల భారం మాపై మోపొద్దు

- ప్రభుత్వానికి లేఖ రాయాలంటూ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు హాస్టల్ విద్యార్థుల వినతి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కాలేజీ విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ ఫీజులు మూడేళ్లుగా రాకపోవడంతో.. హాస్టళ్లలో ఉంటున్న తమను కాలేజీ అధికారులు సెమిస్టర్ పరీక్షలకు అనుమతించడం లేదని జేఎన్‌టీయూ విద్యార్థులు ఆరోపించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 6 కోట్ల బకాయిల భారాన్ని పేద కుటుంబాల నుంచి వచ్చిన తమపై మోపొద్దని ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. ఈ మేరకు శుక్రవారం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. పేరుకు పోయిన బకాయిల కారణంగా మెస్‌లను నడిపే పరిస్థితి లేదని హాస్టల్ నిర్వాహకులు అంటున్నారని, అర్థాంతరంగా హాస్టల్స్ మూసివేస్తే తాము బజారునపడాల్సి వస్తుందని, వారి ఇబ్బందులను రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు. కొత్తగా కొలువైన ప్రభుత్వం నుంచి బకాయిలు త్వరగా విడుదల చేసేలా యూనివర్సిటీ విద్యార్థుల తరఫున సంబంధిత (బీసీ, ఎస్సీ, ఎస్టీ)సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులకు లేఖలు రాయాలని విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు రంజిత్‌కుమార్, రాహుల్‌నాయక్, శివకృష్ణ, దిలీప్ తదితరులున్నారు.

తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడిగా సదానందం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఆకుల సదానందం(వరంగల్) ఎన్నికయ్యారు. ఈ సమాఖ్యకు డాక్టర్ కె.వి.రమణాచారి(రిటైర్డ్ ఐఏఎస్) గౌరవ సలహాదారుగా వ్యవహరించనున్నట్టు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచంద్రరావు తెలిపారు. రవీంద్రభారతిలో జరిగిన సమాఖ్య సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సదానందం, ప్రధాన కార్యదర్శిగా సాదు శ్యామ్‌ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మారంరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వరకవుల దుర్వాసరాజు, కోశాధికారిగా నామ సూర్యవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. సమావేశంలో పౌరాణిక, సాంఘిక నాటకాల పరిరక్షణ, నాటక సంస్థలకు ప్రభుత్వం తోడ్పాటు, కళాకారుల సమస్యలపై చర్చించినట్లు రాంచందర్‌రావు తెలిపారు.

దమ్మాయిగూడలో ఐఎఫ్‌టీయూ నేత కిరణ్ అంత్యక్రియలు

హైదరాబాద్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఆటోమోటారు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు వి.కిరణ్‌కు శుక్రవారం సాయంత్రం దమ్మాయిగూడ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. కిరణ్ మృతికి ఏఐటీయూసీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు బోస్, బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, తెలంగాణ ఆటో సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి దయానంద్ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

కేర్‌లో డయాబెటిక్ ఫుట్, ఊండ్ కేర్ క్లినిక్



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న అమిత్‌గార్గ్, సీఈఓ జస్దీప్ సింగ్

బంజారాహిల్స్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మధుమేహ బాధితుల్లో ఏ చిన్న సమస్య వచ్చినా కష్టమే. ముఖ్యంగా పాదాలకు పుండ్లు పట్టడం ఇబ్బందిగా మారుతుంది. ఇలాంటి వారి కోసం బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్ డయాబెటిక్ ఫుట్, ఊండ్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ క్లినిక్‌ను శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ ఇన్‌చార్జి డైరెక్టర్ అమిత్ గార్గ్, కేర్ హాస్పిటల్స్ గ్రూప్ సీఈఓ జస్దీప్‌సింగ్ ప్రారంభించారు. ఈసందర్భంగా అమిత్‌గార్గ్ మధుమేహంవల్ల కలిగే ఆరోగ్య ఇబ్బందులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కేర్ ఆస్పత్రుల సీఈఓ జస్దీప్ సింగ్ మాట్లాడుతూ.. డయాబెటిక్ కారణంగా పాదాలకు కలిగే గాయాలపై అవగాహన పెంచడానికి, డయాబెటిక్ ఫుట్ అల్సర్‌ల నుంచి సంరక్షణ పొందడానికి ఈ క్లినిక్ అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో క్లినికల్ డైరెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కేర్ వాస్కులర్ డాక్టర్ పీసీ గుప్తా, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి వాల్‌లైన్‌ల పరిశీలన


రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, వాటర్‌వర్క్స్ డీజీఎం వాహబ్

యుసుఫ్‌గూడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో బస్తీల్లో నీటి సమస్యను తెలుసుకునేందుకు రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జలమండలి డీజీఎం వాహబ్‌తో కలిసి పర్యటించారు. సంతోష్‌గిరి, కార్మికనగర్, శ్రీరామ్‌నగర్‌లోని మంచినీటి వాల్‌లైన్లను పరిశీలించారు. స్థానిక బస్తీల్లో ఎదుర్కొంటున్న నీటి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీఆర్ హిల్స్‌లో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనులను పరిశీలించి జాప్యం లేకుండా వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్-1 బస్తీలో ఉన్న మంచినీటి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


శ్రీనివాసుల కల్యాణం వీక్షిస్తున్న భక్తులు

వైభవంగా శ్రీనివాసుల కల్యాణం

బంజారాహిల్స్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఆమోదగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీనివాసుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈసందర్భంగా ఉత్సవ విగ్రహమూర్తులను అలంకరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అపోలో చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ ప్రీతారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



- కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపికైన దానం నాగేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిస్తున్న కన్సూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి పీవీ రవిశేఖర్‌రెడ్డి

- బంజారాహిల్స్, మార్చి 22(ఆంధ్రజ్యోతి)

యజమానులకు తెలియకుండా భూమి రిజిస్ట్రేషన్



సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి స్థలం ఈసీ సర్టిఫికెట్ చూపుతున్న కాంగ్రెస్ నాయకుడు జడ్సన్

పంజాగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి. జీవో 59 కింద అసలు భూమి యజమానులకు తెలియకుండా వారి భూమిని ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు, వారికి సహకరించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రస్తుతం బెంగళూరులో ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తున్న మాసబ్ ట్యాంక్‌కు చెందిన షీన్ రోస్, ఆమె భర్త థామస్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు.

కేరళకు చెందిన షీన్ రోస్ తల్లిదండ్రులు ఫాదర్ ఆంథోనీ మామ్బిల్లి, అల్ఫోన్సా మామ్బిల్లి దంపతులు కొన్ని సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి మాసబ్ ట్యాంక్‌లో మారియా ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించి సాక్రెడ్ హార్ట్ ప్రిపరేటరీ స్కూల్‌ని నడిపేవారన్నారు. 1983 నుంచి 1986 మధ్యలో శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం నవకల్సా పరిధిలోని సర్వే నెంబర్ 66/3లో వేసిన ఒక వెంచర్‌లో 300 గజాల చొప్పున ఉన్న 22 ప్లాట్లు కొనుగోలు చేశారన్నారు. రహదారి వెడల్పు, తదితర వాటి కింద మూడు ప్లాట్లు పోగా, 19 ప్లాట్లు అప్పటి నుంచి వారి ఆధీనంలోనే ప్లాట్లు ఉన్నాయని, అందులో పాఠశాల, అనాథ ఆశ్రమం, ఇతర సేవా కార్యక్రమాలకు భవనాలు కట్టుదామని వారనుకున్నారన్నారు. భూముల ధరలు పెరగడంతో వీరి ప్లాట్లపై కొందరి కన్ను పడిందన్నారు. 2020 సంవత్సరం ఏప్రిల్, మే నెలలో ఫాదర్ ఆంథోనీ మామ్బిల్లి, అల్ఫోన్సా మామ్బిల్లి మృతి చెందారని, దీంతో హైదరాబాద్ డయాసిస్ కార్యదర్శి అల్లం ఆరోగ్యరెడ్డి మృతులు, మారియా ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి రెవెన్యూ అధికారులు సహాయంతో గత సంవత్సరం జీవో 59 కింద ఆ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని, వేరే వారికి విక్రయించాడన్నారు.

ఇటీవల ఈసీ తీయగా ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి తీసివేస్తామని చెప్పినా కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విలువైన భూములకు రెక్కలు వస్తున్నాయన్నారు. అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ హయాంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, సంబంధింత శేరిలింగంపల్లి తహసీల్దార్, అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ వద్ద ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉన్నాయని, తమకు తెలియకుండానే తమ ప్లాట్లను వేరే వారికి రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో రాయదుర్గం పోలీసులను ఆశ్రయించామని షీన్ రోస్ తెలిపారు.

'అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

పంజాగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి, వారి సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జె.నరేష్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా అమరవీరుల కుటుంబాలకు సీఎం, ప్రభుత్వం వద్ద నుంచి ఇప్పటి వరకు ఎలాంటి పిలుపు రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్ని కులాలకు కార్పొరేషన్లు, ఫెడరేషన్లు ఏర్పాటు చేసినట్టే అమరవీరుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

PUBLIC NOTICE

General Public are hereby informed that my client JYOSTNA RANI SATAPATHY, Wife of Late Dusmanta Kumar Mishra client is the owner and resident of Flat No.303, bearing Municipal No.7-1-29/B/303, on Third Floor, of "UNITED AVENUE", in Block-B Leela Nagar, Ameerpet, Hyderabad - Telangana State. My client "JYOSTNA RANI SATAPATHY " name is mis-spelled as "JOSTNA RAMI SATAPATHY" in the registered sale deed **Document No.1317 of 2011 dated 08.08.2011** of the scheduled property. My client has obtained legal heir through OS 112 of 2023 on the file of IInd SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT – HYDERABAD. The correct name "JYOSTNA RANI SATAPATHY" as per the PAN CARD and ADHAR CARD is reflected in the court order of below scheduled property. If any one finds that there are any objections in the above scheduled property, please inform to the below contact no.

Schedule of the above property H NO: No.7-1-29/B/303 : **NORTH, : : Open to Sky, SOUTH :: Flat No.302/B, EAST :: Open to Sky, WEST :: Flat No.303/A.**

T. Praveen Sagar, Advocate
Cell: 8341501503

గొల్ల కురుమలు వేర్వేరు కాదు.. ఒక్కటే


సమావేశంలో మాట్లాడుతున్న వేదిక చైర్మన్ మేకల కృష్ణ

పంజాగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 18 శాతం జనాభా ఉన్న గొల్లకురుమలను రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తమ సామాజిక వర్గాన్ని విస్మరిస్తోందని పలువురు వక్తలు ఆరోపించారు. రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం విభజించి పాలిస్తున్నారని, గొల్ల కురుమలు వేర్వేరు కాదు.. ఒక్కటే అన్నారు. తమను విస్మరించే పార్టీలను బొంద పెడుతామని వారు హెచ్చరించారు. యాదవ - కురుమల రాజ్యాధికార వేదిక ఆధ్వర్యంలో మెమొంతో - మా కంత అనే అంశంపై శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక చైర్మన్ మేకల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రొఫెసర్లు ప్రభంజన్ యాదవ్, సింహాద్రి, రాము యాదవ్, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, క్యామ మల్లేష్, వివిధ సంఘాల నాయకులు రమేష్ యాదవ్, మేకల రాములు యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, జవహర్ నగర్ కార్పొరేటర్ లలిత మాట్లాడారు. తెలంగాణలో గొల్ల కురుమల మద్దతుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవులు, ఎంపీ అభ్యర్థుల పోటీ విషయంలో తమకు తీవ్ర అన్యాయం చేసిందని వారు ఆరోపించారు.

గొల్ల కురుమలను విస్మరించే పార్టీలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ది చెబుతామని హెచ్చరించారు. అవినీతిని వెలికి తీసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని శాఖల్లో అవినీతి జరిగితే ఒక్క తలసాని శ్రీనివాస్ యాదవ్ మీదనే విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి జిల్లా, మండలం, గ్రామాల్లోని మన వారికి వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించాలని, మన చరిత్రను, సామాజిక, రాజకీయ పరిస్థితుల గురించి విశ్లేషించి చెప్పాలన్నారు. దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన కోసం పట్టుబడుదామన్నారు. గ్రామా ల్లో ఉపాధి లేక ఒగ్గు పూజారులు పట్టణాలకు వలస పోయి దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని, మన ఆరాధ్య దైవాలు మల్లన్న, బీరన్న దేవుళ్ల వివాహాలు, పూజలు నిర్వహించే ఒగ్గు పూజారులతోనే మన పిల్లల వివాహాలు జరిపిద్దామన్నారు. మన జాతిలో ఉన్నవారే మనకు అన్యాయం చేస్తున్నారని, గొల్ల కురుమలు వేర్వేరు కాదు ఒక్కటేనని చెప్పాలన్నారు.మన హక్కులు, వాటా కోసమే మన పోరాటమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమపై వివక్ష చూపుతోందన్నారు. 119 స్థానాలో 17 ఎమ్మెల్యేలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం నాలుగింటే నాలుగు సీట్లు ఇవ్వడం తమ సామాజిక వర్గాలను అవమానించడమేనన్నారు. జనాభా దామాషా ప్రకారం మూడు మంత్రి పదవులు, ఆరు ఎమ్మెల్సీలు, రెండు ఎంపీ సీట్లు, 13 కార్పొరేషన్ చైర్మన్లు ఇవ్వాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం గొల్లకురుమల ఊసెత్తలేదని, అధికారంలోకి వచ్చాక తమను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందన్నారు. ఒకటి, రెండు కులాలకు పదవులు కట్టబెట్టడమే సామాజిక న్యాయమా, ఉదయపూర్ డిక్లరేషన్ బీసీలను మోసం చెయడానికేనా అని ప్రశ్నించారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సమతా యదవ్, హరి కృష్ణ యాదవ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ ఫైనల్లో రైల్వే జట్టు



పోటీల్లోని దృశ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఎస్‌డబ్ల్యూఏటీ) నిర్వహిస్తున్న శామ్యూల్ వసంత్ కుమార్ స్మారక బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జట్టు ఫైనల్స్ చేరింది. శనివారం వైఎంసీఏ సికింద్రాబాద్‌లో జరిగిన సెమీస్ పోరులో ఎస్‌సీఆర్ జట్టు 83-57 స్కోరుతో సనత్‌నగర్ టీమ్‌పై విజయం సాధించింది. ఎస్‌సీఆర్ ఆటగాళ్ల సంతోష్(20 పాయింట్లు), విజయ్ (18 పాయింట్లు) ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు.



ట్రాఫిక్‌పోలీసులకు బటర్ మిల్క్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు



వాటర్ బాటిల్, గ్లూకాన్-డి పంపిణీ చేస్తున్న గోపాలపురం ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు,ఎస్సై సతీష్

విధి నిర్వహణలో పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలి

రెజిమెంటల్‌బజార్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు అన్నారు. ప్రతి సంవత్సరం వేసవికాలంలో పోలీస్‌శాఖ ట్రాఫిక్ పోలీసులకు అందిస్తున్న బటర్‌మిల్క్, గ్లూకాన్-డి,వాటర్ బాటిల్‌లను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి అందించారు. ఎస్సైలు సతీష్, బసు పాల్గొన్నారు.

చిలకలగూడలో..

బౌద్ధనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):వేసవికాలం దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ కానిస్టేబుల్స్, సిబ్బంది అనారోగ్యం పాలుకాకుండా తగినచర్యలు తీసుకుంటున్నామని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం చిలకలగూడలో సిబ్బందికి గ్లూకోజ్ ప్యాకెట్స్, వాటర్‌బాటిల్స్‌ను పంపిణీ చేశారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులకు ఏసీపీ శంకర్ రాజు శుక్రవారం తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో బటర్ మిల్క్, స్నాక్స్ పంపిణీ చేశారు. త్వరలోనే కళ్లదాలు, బూట్లు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల దళిత సంఘాల నాయకులు

కంటోన్మెంట్ ఉప ఎన్నికలో మాదిగలకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

బోయినపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఉప ఎన్నికలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సికింద్రాబాద్‌లోని లీ ప్యాలెస్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకులు శ్రీకిషన్ మాదిగ, అజిత్ కళ్యాణ్, సునీల్ మాదిగ, శ్రీకాంత్ మాదిగల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకుడు శ్రీకిషన్ మాదిగ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నిమెజకవర్గంలో మాదిగలు అధికసంఖ్యలో ఉన్నా 50 ఏళ్ల నుంచి టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరుగనున్న ఉపఎన్నికలో మాదిగలకు టికెట్ కేటాయించాలని కోరుతూ అన్ని ప్రధాన పార్టీల నాయకులకు వినిపత్రాలను ఇస్తామని తెలిపారు. ఈ ఉప ఎన్నికలో మాదిగలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వని పార్టీలకు బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో గోపి మాదిగ, బీజేపీ నాయకులు పరశురాం, శంకర్, శివ, విజయరామరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడమర్తి రవి మాదిగ, శ్యాంసన్ రాజు, భరత్, బీఎస్‌పీ నాయకులు రాజేందర్, లింగం, టీడీపీ నాయకులు నర్సింగ్, మధు, ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుపాకీతో బెదిరించి దోపిడీకి యత్నించిన వారితో పోరాడి తరిమిన పైగా కాలనీకి చెందిన తల్లి అమిత, కుమార్తె భవిలను సత్కరించిన మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ తదితరులు

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

దమ్మాయిగూడలో ఐఎఫ్‌టీయూ నేత కిరణ్ అంత్యక్రియలు

హైదరాబాద్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఆటోమోటారు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్రనాయకుడు వి.కిరణ్‌కు శుక్రవారం సాయంత్రం దమ్మాయిగూడ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. కిరణ్ మృతికి ఏఐటీయూసీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు బోస్, బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, తెలంగాణ ఆటో సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి దయానంద్ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడిగా సదానందం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఆకుల సదానందం(వరంగల్) ఎన్నికయ్యారు. ఈ సమాఖ్యకు డాక్టర్ కె.వి.రమణాచారి(రిటైర్డ్ ఐఏఎస్) గౌరవ సలహాదారుగా వ్యవహరించనున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచంద్రరావు తెలిపారు. రవీంద్రభారతిలో జరిగిన సమాఖ్య సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సదానందం, ప్రధాన కార్యదర్శిగా సాదు శ్యామ్‌ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మారంరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వరకవుల దుర్వాసరాజు, కోశాధికారిగా నామ సూర్యవర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. సమావేశంలో పౌరాణిక, సాంఘిక నాటకాల పరిరక్షణ, నాటక సంస్థలకు ప్రభుత్వం తోడ్పాటు, కళాకారుల సమస్యలపై చర్చించినట్లు రాంచందర్‌రావు తెలిపారు.

భవిష్యత్‌లో తీవ్రంగా నీటి కొరత



మాట్లాడుతున్న సాగర్ ధార

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో తీవ్రంగా నీటికొరత ఏర్పడబోతున్నదని, నీటి కోసం దేశాల మధ్య యుద్ధాలు జరిగే అవకాశం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. సదస్సుకు ఐఐసీటీ రిటైర్డ్ శాస్త్రవేత్త కలపాల బాబురావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ముంబాయి ఐఐటీ శాస్త్రవేత్త సాగర్ ధార, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకురాలు సరస్వతి, పర్యావరణవేత్త దొంతి నరసింహారెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. నీటి సమస్యను ప్రపంచ దేశాల సమస్యగా చూడాలన్నారు. ఫార్మారంగం వల్ల రాష్ట్రంలో తీవ్రంగా నీటికొరత ఏర్పడడమే కాకుండా నీటి కాలుష్యం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు 17 ఇథనాల్ కంపెనీలు వస్తున్నాయని, ఈ కంపెనీలు ఎక్కువ మొత్తంలో నీటి వనరులను ఉపయోగించుకోవడం ద్వారా తాగునీరు, సాగునీరు కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రజలతో చర్చించకుండా, ప్రజాభిప్రాయం సేకరణ చేయకుండా ఇథనాల్ పాలసీ తీసుకురావడం ప్రజాస్వామ్య వ్యతిరేకమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇథనాల్ పాలసీని నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

పద్మారావునగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి, దేశ ప్రజల సంక్షేమం కోసం బాధ్యత గల పౌరులు ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. సనత్‌నగర్ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని దేవీనగర్, పద్మారావునగర్‌లోని బ్రూక్ బాండ్ కాలనీ, శివానంద ఆశ్రమం సమీపంలోని పద్మనాభ రెసిడెన్సీ, బోయగూడలోని టింబర్ డిపో ప్రాంతాలలో కిషన్‌రెడ్డి బీజేపీ శ్రేణులతో కలసి శుక్రవారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పద్మనాభ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని, వందల కోట్ల రూపాయల వ్యయంతో జాతీయ రహదారులను, రీజినల్ రింగ్ రోడ్లను నిర్మించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో అనేక కుంభకోణాలు వెలుగు చూసాయని అన్నారు. నరేంద్ర మోడీ పాలనలో అవినీతికి తావులేదని తెలిపారు. సికింద్రాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుదర్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖరరెడ్డి, బీజేపీ నాయకులు వివిధ కాలనీల సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరికే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు..

- మంజూరుకు మంత్రి తుమ్మల హామీ



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి

తిరుమలగిరి మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సీఎం కోటా కింద ఇందిరమ్మ ఇళ్లను అత్యధికంగా మంజూరు చేయిస్తానని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీనిచ్చారు. శుక్రవారం తిరుమలగిరిలోని జయలక్ష్మీ గార్డెన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న పట్నం సునీతారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ తిరిగి గాడిలో పెడుతామని తెలిపారు. కేంద్రంలో రాబోయేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. హైదరాబాద్‌కు కావాల్సిన వనరులు సాధించుకున్నామని, కంటోన్మెంట్ స్కైవేలను ఏర్పాటు చేయడానికి రక్షణ శాఖ ద్వారా అనుమతి పొందడం సీఎం రేవంత్ రెడ్డి ఘనతగా చెప్పుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, వెన్నెల, శ్రీగణేష్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగా రవీందర్ గుప్తాను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

మతతత్వ పార్టీలతో జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుమలగిరి జయలక్ష్మీ గార్డెన్స్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఓటర్ల దీవెనలతోనే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న మతతత్వ పార్టీ అభ్యర్థి గతంలో కేసీఆర్‌తో కలిసి అవినీతికి పాల్పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. పేద వర్గాలకు ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు, అభ్యర్థి సునీతా రెడ్డి, కిషన్, వెన్నెల, శ్రీగణేష్, జయప్రకాష్, నరసింహన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై అవగాహన ఉండాలి



గర్భిణి స్త్రీలకు అందజేసే వివిధ రకాల పౌష్టిక ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మారేడుపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడి టీచర్లకు చట్టాలపై అవగాహన ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం ఈస్ట్ మారేడుపల్లి టీచర్స్ కాలనీలో తెలంగాణ మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్రైనింగ్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెటి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోషణ పక్వాడలో భాగంగా ఆరు నెలల చిన్నారులకు, గర్భిణీలు, శ్రీమంతులు కలిసి చిన్నారులకు ఆయన చేతుల మీదుగా అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడి టీచర్లు గర్భిణీ స్త్రీలు, బాలింతలు తినే పోషక ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పోషక ఆహారాన్ని గర్భిణీ స్త్రీలు బాలింతలు, తీసుకునేలా చూడాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపిఎంఏఎస్ఎస్ అధికారి భవాని అజయ్, సైబర్ క్రైమ్స్ అధికారి శైలజ, డిడబ్ల్యూఓ అధికారి ఆకేశ్వర రావు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సునంద, సూపర్‌వైజర్లు సంధ్య, రేణుక, హరిప్రియ, జ్యోతి, కవిత, లక్ష్మీ, జాహ్నవి,, పోషక అభియాన్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ భరత్, డిహెచ్ఈడబ్ల్యూ తేజస్విని, ఝాన్సి, దీపిక, స్పీకర్స్ శైలజ పాల్గొన్నారు.

రైళ్ల నిర్వహణలో భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్

సికింద్రాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రైళ్ల నిర్వహణలో భద్రతా నియమాలను అధికారులు, సిబ్బంది కచ్చితంగా పాటించాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సూచించారు. జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రత, సమయపాలన, వివిధ ట్రాఫిక్ సౌకర్యాల పనుల పురోగతిపై శుక్రవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు, గార్డులు తదితరులతోపాటు భద్రత సంబంధిత సిబ్బందికి తరచూ క్షేత్ర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జోన్‌లో పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక పరికరాలు, తదితర వస్తువుల లభ్యతను రైల్వే జీఎం సమీక్షించారు. అనూహ్య, అత్యవసర సమయంలో సరిపడా నిల్వలు ఉండేలా చూడాలని అధికారులను సూచించారు. రోడ్డు ప్రయాణీకుల భద్రత కోసం నాన్ ఇంటర్ లాకింగ్ లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద నాయిస్ లాగర్ సదుపాయాలు కల్పించవలసిన ఆవశ్యతను ఆయన గుర్తు చేశారు. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయ పాలనపై చర్చిస్తూ ట్రాక్ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకుని, సమయ పాలనను మెరుగు పరచుకోవాలని అధికారులకు సూచించారు. సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ చేయడానికి అదనపు లూప్ లైన్ల ఏర్పాటు, హాల్టు స్టేషన్లను క్రాసింగ్ స్టేషన్లుగా మార్చడం, పొడవైన లూప్‌లైన్ల ఏర్పాటు అంశాలను సమీక్షించారు. రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ధనంజయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

గొల్ల కురుమలు వేర్వేరు కాదు.. ఒక్కటే



సమావేశంలో మాట్లాడుతున్న వేదిక చైర్మన్ మేకల కృష్ణ

పంజాగుట్ట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 18 శాతం జనాభా ఉన్న గొల్లకురుమలను రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తమ సామాజిక వర్గాన్ని విస్మరిస్తోందని పలువురు వక్తలు ఆరోపించారు. రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం విభజించి పాలిస్తున్నారని, గొల్ల కురుమలు వేర్వేరు కాదు.. ఒక్కటే అన్నారు. తమను విస్మరించే పార్టీలను బొంద పెడుతామని వారు హెచ్చరించారు. యాదవ - కురుమల రాజ్యాధికార వేదిక ఆధ్వర్యంలో మెమొంతో - మా కంత అనే అంశంపై శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక చైర్మన్ మేకల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రొఫెసర్లు ప్రభంజన్ యాదవ్, సింహాద్రి, రాము యాదవ్, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, క్యామ మల్లేష్, వివిధ సంఘాల నాయకులు రమేష్ యాదవ్, మేకల రాములు యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, జవహర్ నగర్ కార్పొరేటర్ లలిత మాట్లాడారు. తెలంగాణలో గొల్ల కురుమల మద్దతుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవులు, ఎంపీ అభ్యర్థుల పోటీ విషయంలో తమకు తీవ్ర అన్యాయం చేసిందని వారు ఆరోపించారు.

గొల్ల కురుమలను విస్మరించే పార్టీలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అవినీతిని వెలికి తీసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని శాఖల్లో అవినీతి జరిగితే ఒక్క తలసాని శ్రీనివాస్ యాదవ్ మీదనే విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి జిల్లా, మండలం, గ్రామాల్లోని మన వారికి వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించాలని, మన చరిత్రను, సామాజిక, రాజకీయ పరిస్థితుల గురించి విశ్లేషించి చెప్పాలన్నారు. దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన కోసం పట్టుబడుదామన్నారు. గ్రామా ల్లో ఉపాధి లేక ఒగ్గు పూజారులు పట్టణాలకు వలస పోయి దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని, మన ఆరాధ్య దైవాలు మల్లన్న, బీరన్న దేవుళ్ళ వివాహాలు, పూజలు నిర్వహించే ఒగ్గు పూజారులతోనే మన పిల్లల వివాహాలు జరిపిద్దామన్నారు. మన జాతిలో ఉన్నవారే మనకు అన్యాయం చేస్తున్నారని, గొల్ల కురుమలు వేర్వేరు కాదు ఒక్కటేనని చెప్పాలన్నారు.మన హక్కులు, వాటా కోసమే మన పోరాటమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమపై వివక్ష చూపుతోందన్నారు. 119 స్థానాల్లో 17 ఎమ్మెల్యేలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం నాలుగుంటే నాలుగు సీట్లు ఇవ్వడం తమ సామాజిక వర్గాలను అవమానించడమేనన్నారు. జనాభా దామాషా ప్రకారం మూడు మంత్రి పదవులు, ఆరు ఎమ్మెల్సీలు, రెండు ఎంపీ సీట్లు, 13 కార్పొరేషన్ చైర్మన్లు ఇవ్వాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం గొల్లకురుమల ఊసెత్తలేదని, అధికారంలోకి వచ్చాక తమను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందన్నారు. ఒకటి, రెండు కులాలకు పదవులు కట్టబెట్టడమే సామాజిక న్యాయమా, ఉదయపూర్ డిక్లరేషన్ బీసీలను మోసం చెయడానికేనా అని ప్రశ్నించారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సమతా యదవ్, హరికృష్ణ యాదవ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

రాయదుర్గం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ నెల 16న శివాజీనగర్‌లో నివాసం ఉండే కనకమహాలక్ష్మి కుమారుడు సాయికిరణ్(8) ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. బాలుడి కోసం కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా జాడ తెలియకపోవడంతో శుక్రవారం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.



సాయికిరణ్



ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం ఇస్తున్న లష్కర్ సాధన సమితి సభ్యులు

సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలి

బౌద్ధనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాల్సిన అవసరముందని మాజీమంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నూతనంగా సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని చేపట్టిన ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరుతూ శుక్రవారం లష్కర్ సాధనసమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, నలభై జీహెచ్‌ఎంసీ డివిజన్లతో కూడిన సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ తలసాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖను రాశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, సభ్యులు అశోక్, కృష్ణసాగర్, సునీల్‌ముదిరాజ్, జగ్గయ్య, రవీంద్రసాగర్ తదితరులు పాల్గొన్నారు.



టీబీ అవగాహన ర్యాలీ నిర్వహించిన గాంధీ వైద్యులు

టీబీపై అవగాహన అవసరం

అడ్డగుట్ట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు సూచించారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా గాంధీలోని వివిధ విభాగాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నర్సులు గాంధీ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన తీసుకరావడమే గాకుండా ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి రెస్పిరేటరీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.జీ కృష్ణమూర్తి, ఆర్ఎంఓ జయకృష్ణ, అసోసియోట్ ప్రొఫెసర్లు రాములు, డాక్టర్ స్వాతిలతో పాటు నర్సులు, జూనియర్ వైద్యులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

నేడు కర్ణాటక, హిందూస్తానీ గాత్ర కచేరీలు

చిలకలగూడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేలాదిమంది సంగీత కళాకారుల్ని తీర్చిదిద్దిన భాస్కర లలిత (హైదరాబాద్ సిస్టర్స్‌లో ఒకరు) తృతీయ వర్ధంతి పురస్కరించుకుని కర్ణాటక, హిందూస్తానీ గాత్ర కచేరీలు నిర్వహిస్తున్నట్లు ఆమె సోదరి బి.హరిప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సంగీత ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆమె కోరారు.



కన్నాభిరాంను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ అడ్డగుట్ట డివిజన్ ఇన్‌చార్జిగా కన్నాభిరాం

అడ్డగుట్ట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కోసం శ్రమించి పనిచేస్తానని నూతనంగా నియమితులైన సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్ ఇన్‌చార్జి కన్నాభిరాం అన్నారు. అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్‌లో సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థిగా కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. తనకు ఈ పదవి బాధ్యతలు అప్పగించిన కిషన్ రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణి, సికింద్రాబాద్ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, అడ్డగుట్ట డివిజన్ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కన్నాభిరాంకు డివిజన్ సీనియర్ నేతలు ఘనంగా సన్మానం చేశారు. బీజేపీ నాయకులు వీరేశం, మహేందర్, నరేందర్, వీరేశం, సాయిబాబా, వేణుగోపాల్, హంసరాజు, శ్రీధర్ సాయన్నలు పాల్గొన్నారు.

ఘనంగా ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేషన్ వేడుకలు

- రాడార్ కంట్రోలర్స్ పట్టభద్రులుగా 8 మంది



ఎయిర్ ట్రాఫిక్ సర్వైలెన్స్ సర్వీసెస్ అవార్డు గ్రహీతలతో ఎయిర్‌వైస్ మార్షల్ డీఎస్.జోషి

అల్వాల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 147వ ఎయిర్ ట్రాఫిక్ సర్వైలెన్స్ సర్వీసెస్ (ఏటీఎస్ఎస్), 111 ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఎయిర్ లాస్ (బేసిక్) కోర్సు విజయవంతంగా పూర్తి కావడంతో శుక్రవారం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్స్ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏటీసీఓటీఈ) గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అకాడమీ కమాండెంట్ ఎయిర్‌వైస్ మార్షల్ డీఎస్. జోషి ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణలో ప్రతిభ కనపరిచిన వారికి ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్స్ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏటీసీఓటీఈ) అనేది ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్)కు చెందిన ప్రధాన శిక్షణ సంస్థ అన్నారు. మూడు నెలలపాటు నిర్వహించిన ఎయిర్ ట్రాఫిక్ సర్వైలెన్స్ సర్వీసెస్ కోర్సు, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోర్సులో భారత వైమానిక దళానికి చెందిన అధికారులు, భారత నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన మొత్తం 8 మంది రాడార్ కంట్రోలర్లుగా పట్టభద్రులయ్యారు. ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, మిత్రదేశాలకు చెందిన వారికి ఇక్కడ శిక్షణ అందిస్తున్నారు.

మార్షల్ ఆర్ట్స్ అంతర్జాతీయ పోటీలకు సాయికుమార్

బోయినపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలోని బాలంరాయికి చెందిన సాయికుమార్ సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ కరాటె అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఓజీఆర్‌వై కరాటె ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 10 నుంచి 16 వరకు మలేషియాలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం గాయత్రి గార్డెన్స్‌లో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ బోయినపల్లి సభ్యులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సాయికుమార్‌ను అభినందించారు. అనంతరం తనవంతుగా ఎం.సాయికుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, జగదీష్, రమేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డగుట్ట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా చనిపోయి ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు గాంధీ మార్చురికి తరలించారు. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న బాబు అనే కానిస్టేబుల్ చూసి వెంటనే గోపాలపురం పోలీసుల ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అక్కడి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. మృతుడు తెలుపు రంగు చొక్కా, నీలం రంగు జీన్స్ పాయింట్ ధరించాడని, ఈ వ్యక్తి ఆచూకి తెలిస్తే వెంటనే 8712660248, 8712571661 నెంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.